# విపశ్యన మాసపత్రిక

VOLUME : 2 NO - 5 1 AUGUST 2007

*(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగుమాస పత్రిక)*

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్, వనస్థలిపురం, హైదరాబాదు - 70

## "ధర్మవాణి"

*ఉపయో హి ధమ్మేసు ఉపేతి వాదం,*
*అనూపయం కేన కథం వదెయ్య ।*
*అత్తం నిరత్తం న హి తస్స అత్థి,*
*అధోసి సో దిట్ఠిమిధేవ సబ్బం ।*
*... సుత్తనిపాత । దుట్ఠట్ఠక సుత్తం - 8*

ఆసక్తుడైన వ్యక్తి మాత్రమే ధర్మము గురించిన వివాదములలో పడతాడు. అనాసక్తుడైన వ్యక్తి వివాదములలో ఎలా పడతాడు? ఎందుకు పడతాడు? అతడు అన్ని దార్శనిక నమ్మకములనూ త్యజించాడు. అతనికి ఆత్మవాదమూ లేదు. నిరాత్మవాదమూ లేదు.

## బుద్ధభగవానుడు - ఆయన శిక్షణ

రండి, బుద్ధుని గురించీ, ఆయన శిక్షణ గురించీ తెలుసుకుందాం ! సరైన రీతిలో అర్థం చేసుకుందాం !

పౌరాణిక మరియు అలౌకిక వ్యాఖ్యానముల అస్పష్టత కారణంగా తరచూ బుద్ధుడి నిజమైన వ్యక్తిత్వం మసకబారిపోతుంటుంది. కల్యాణకరమైన ఆయన శిక్షణకు కూడా అదే పరిస్థితి ఏర్పడుతుంది. మనం అలా జరుగనివ్వరాదు. ఇందులోనే మనందరి మేలు సమ్మిళితమై ఉంది.

గౌతమబుద్ధుడు మనదేశానికి చెందిన చారిత్రాత్మక మహాపురుషుడు. బుద్ధుడి గురించి, ఆయన శిక్షణ గురించిన వాస్తవాలను తెలుసుకోవడానికి స్వయంగా ఆయన చేసిన ఉపదేశాలను ఆధారం చేసుకోవడమే సముచితం. అంతేగాని వేరెవరి కథనాలనో ఆధారం చేసుకోకూడదు. వేరేవాళ్ళ కథనాలు నిజమైనవే అయి ఉండవచ్చు. కాని వాళ్ళు గనుక తమ దార్శనిక నమ్మకాల రంగుటద్దాలలో నుండి చూసినట్లయితే అవి అసత్యమూ, భ్రాంతి కలిగించేవి కూడా అయి ఉండవచ్చు. బుద్ధభగవానుడి మూలవాణి మనదేశం నుండి దాదాపు 1500- 2000 సంవత్సరాలుగా కనుమరుగయింది. కాని మన సౌభాగ్యం వల్ల పొరుగు దేశాలలో అది మనదేశంనుండి ఎలా వెళ్ళిందో అలాగే దాని శుద్ధరూపంలో పదిలపరచబడింది. ఇంత దీర్ఘవిరామం తరువాత మనదేశానికి తిరిగి వచ్చింది. మనం దీనినుండి పూర్తి లాభం పొందాలి. ఈ అమూల్యమైన భారతదేశపు చారిత్రాత్మక సాహిత్యాన్ని వైజ్ఞానిక దృష్టితో అధ్యయనం చేయడం వల్ల బుద్ధుడి గురించీ, ఆయన శిక్షణ గురించీ అనేక వాస్తవాలు స్పష్టంగా వెలుగులోకి వస్తాయి.

1) బోధిసత్త్వుడయిన సిద్ధార్థగౌతముడు అనేక జన్మల కృషి మరియు పురుషార్థముల ద్వారా పుణ్యపారమితలను (భవసాగరమును దాటేందుకు అవసరమయిన ధర్మగుణములను) పరిపూర్ణంగా సమకూర్చుకొని, ఈ అంతిమ జన్మలో సమ్యక్‌రూపంలో సంబుద్ధుడయ్యాడు. స్వయంగా బుద్ధుడయ్యాడు. ఎవరి కృపవల్లనో ఆయన బుద్ధుడు కాలేదు.

2) గౌతమబుద్ధుడు భగవానుడని పిలువబడ్డాడు. ఈనాటి భారతదేశపు సామాన్య వాడుక భాషలో భగవానుడు అని అన్నప్పుడు దానర్థం ఈశ్వరుడు లేదా పరమాత్ముడు. కాని ఇరవైఆరు శతాబ్దముల పూర్వంనాటి భారతదేశపు జనభాషలో దీనర్థం వేరుగా ఉండేది. బుద్ధవాణిలో దీని వివరణ స్పష్టంగా ఉంది.

*"భగ్గరాగో, భగ్గదోసో, భగ్గమోహో తి భగవా ।"*

ఏ వ్యక్తి తన రాగములను భగ్నం చేసుకున్నాడో, ద్వేషములను భగ్నం చేసుకున్నాడో, మోహములను భగ్నం చేసుకున్నాడో ఆ వ్యక్తి భగవానుడు. ఈ స్థితిని ప్రాప్తింపజేసుకుని, ఏవ్యక్తి అయినా భగవానుడు కాగలడు.

3) బుద్ధభగవానుడు దార్శనిక తత్త్వవేత్త కాదు. ఆయనకు తనదంటూ ఏ సాంప్రదాయమూ లేదు. ఆయన ఏ సాంప్రదాయమునూ స్థాపించలేదు. ఎవరయినా ఆయనను "భగవాన్! మీది ఏ దార్శనిక నమ్మకం?" అని అడిగినపుడు ఆయన ఇలా చెప్పేవాడు....

*"దిట్ఠిగతం తి ఖోవచ్చ, అపనీతమేతం తథాగతస్స"*

-" ఓ పుత్రుడా! తథాగతుడి దార్శనిక నమ్మకములు దూరమై పోయాయి. తథాగతుడు దార్శనిక నమ్మకముల కన్నా ఉన్నతంగా ఎదిగాడు, వాటిని దాటివేశాడు". రకరకాల మనుష్యులు తమతమ దార్శనిక నమ్మకములలో ఎలా కూరుకుపోయి ఉంటారో, ఏవిధంగా వాటి ఉచ్చులో చిక్కుకుపోయి ఉంటారో అనే సత్యాన్ని ఆయన ఎంతో బాగా తెలుసుకున్నాడు.

*తదేవ థామసా పరామాసా అభినివిస్స వోహరన్తి ।*

- ఆసక్తిగలవారు దీనినే గట్టిగా పట్టుకొని వేళ్ళాడుతుంటారు. ఆసక్తివశులై వారు ఎంత గుడ్డివారవుతారంటే, తమ నమ్మకమే సరైనదని, ఇతరుల నమ్మకం తప్పుఅనీ అనుకొంటారు.

*ఇదమేవ సచ్చం మోఘమఞ్ఞం ।*

- ఇదే సత్యం, మిగతావి అన్నీ అసత్యాలు.

సమాజములో వ్యాప్తిలో ఉన్న దార్శనిక నమ్మకాలన్నీ బుద్ధిజన్య కల్పనలపై లేదా అపరిపూర్ణ అనుభూతులపై ఆధారితమైనవే. కాబట్టి అవి సత్యములు కాని కారణంగా, అవి హానికారకములు, దుఃఖాన్ని కలిగించేవి.

*అత్థి మే అత్తాతి వా అస్స సచ్చతో దిట్ఠి ఉప్పజ్జతి ।*

- నా ఆత్మ ఉంది, ఇది నిజము. ఇలా దేహచిత్తములకు సంబంధించిన ఏదో ఒక కల్పన ఆధారంపై ఒక దార్శనిక నమ్మకం ఆవిర్భవిస్తుంది. ఆ తరువాత తమమీద తమకు లోతైన ఆసక్తి కారణం చేత, ఆ నమ్మకం సమాజంలో వ్యాపిస్తుంది.

*అయం అత్తా నిచ్చో, ధువో, సస్సతో ।*

- ఈ ఆత్మ నిత్యమైనది, ధ్రువమైనది, శాశ్వతమైనది ।

**అవిపరిణామధమ్మో**

- అపరివర్తన (మార్పుచెందని) స్వభావం గలది కాబట్టి, ఎలా ఉన్నదో, జన్మ-జన్మాంతరములవరకు అలానే ఉంటుంది.

**తథేవ రస్సతీతి**

- అలాగే స్థిరంగా ఉంటుంది.

ఇటువంటి అన్ని దార్శనిక నమ్మకాల గురించి భగవానుడు అంటాడు .

**ఇదం వుచ్చతి, భిక్ఖవే, దిట్ఠిగతం ।**

- భిక్షువులారా ! దీనిని దార్శనిక నమ్మకాల జంజాటంలో పడిపోవటమని అంటారు.

**దిట్ఠిగహనం** - ఇది దార్శనిక నమ్మకాల దట్టమైన అడవి.

**దిట్ఠికన్తారం** - దార్శనిక నమ్మకాల ఎడారి. భయంకరమైన ఎడారి.

**దిట్ఠివిసూకం** - దార్శనిక నమ్మకాల క్రీడా విలాసము, ఆట, బాహ్యాడంబరము, పైపై తళుకు.

**దిట్ఠివిప్ఫన్దితం** - దార్శనిక నమ్మకంలో కొట్టుమిట్టాడటం, విలవిల్లాడటం.

**దిట్ఠిసఞ్ఞోజనం** - దార్శనికపు ఉరితాడు, బంధనము.

ఇటువంటి నమ్మకాలలో బంధించబడిన వ్యక్తి

**న పరిముచ్చతి దుక్ఖస్మాతి వదామి ।**

దుఃఖమునుండి విముక్తుడు కాలేడు అని నేనంటాను.

భగవానుడు ఈ విషయమును ఎంతో సాధికారికంగా చెప్పాడు. కారణం స్పష్టం. ఎప్పటివరకు ఆత్మభావం, అహంభావం నిలిచిఉంటుందో, "నేను -నాది" ల సంయోజనము (చేరిక) నిలిచి ఉంటుందో, అప్పటివరకు భవముక్తుడెలా అవుతాడు? భవముక్తుడు కాకుండా దుఃఖముక్తుడెలా అవుతాడు? తన అస్తిత్వమును నిలిపి ఉంచుకోవాలనే తీవ్రమైన ఇచ్ఛ ఆధారంగానే అలాంటి కల్పితమైన దార్శనికమాన్యతలతో కూడి ఉంటాడు. ఈ కారణమే అతనిని ఏదో ఒక లోకంతో కట్టి ఉంచుతుంది. ఎందుకంటే ఇదే అతని మనోభావన యొక్క కల్పన. అందువల్లనే భగవానుడు అంటాడు. "ఈ నమ్మకాలన్నీ ప్రమాదకరమైనవే, హాని కలిగించేవే".

**మఞ్ఞితం, భిక్ఖు, రోగో**

- హే భిక్షూ, దార్శనిక నమ్మకము ఒక రోగము.

ఇది ఎలాంటి భవ రోగమంటే జన్మ-జన్మాంతరముల వరకు రోగిగానే ఉంచుతుంది.

**మఞ్ఞితం గణ్డో**

- దార్శనిక నమ్మకము ఒక రాచపుండు.

ఎలాంటి పుండు అంటే జన్మ-జన్మాంతరముల వరకు చీముకారుతూనే ఉంటుంది.

**మఞ్ఞితం సల్లం**

- దార్శనిక నమ్మకము ఒక బాణం

ఎలాంటి బాణమంటే జన్మ-జన్మాంతరముల వరకు గుచ్చుతూ, చీల్చుతూ, బాధపెడుతూనే ఉంటుంది.

దార్శనిక నమ్మకముల ఆధారంగా మత సంప్రదాయాలు స్థాపించబడతాయి. దార్శనిక నమ్మకములలో చిక్కున్న ఇలాంటి సంప్రదాయాలు అన్ని సమాజములలోనూ ఉంటాయి. ఆనాటి భారతదేశంలో ఎలా ఉండేది మనం చూస్తాము . . . .

**తేన ఖో పన సమయేన** - ఆ సమయంలో

**సమ్బహులా నానా తిత్థియ - సమణ - బ్రాహ్మణ - పరిబ్బాజకా**

- ఎందరో భిన్న భిన్న సంప్రదాయవాదులు శ్రమణులలోనూ ఉండేవారు, బ్రాహ్మణులలోనూ ఉండేవారు, సన్యాసులలోనూ ఉండేవారు.

**సావత్థియం పటివసన్తి** - శ్రావస్తి నగరంలో ఉండేవారు.

**నానాదిట్ఠికా** - నానా విధముల దార్శనిక నమ్మకాలను నమ్మేవాళ్ళు

**నానాఖన్తికా** - భిన్న భిన్న మతాంతరముల వాళ్లు

**నానారుచికా** - భిన్న భిన్న అభిరుచులు గలవాళ్లు

**నానాదిట్ఠినిస్సయనిస్సితా** - భిన్న భిన్న దార్శనిక నమ్మకాలను ఆశ్రయించిన వాళ్ళు

**తే భణ్డనజాతా కలహజాతా వివాదాపన్నా** - పరస్పరం కొట్టుకుంటూ, తిట్టుకుంటూ, కలహించుకుంటూ, వివాదాలలో పడిపోయి ఉండేవారు.

**అఞ్ఞమఞ్ఞం** - ఒకరినొకరు

**ముఖసత్తీహి వితుదన్తా విహరన్తి**

- మాటల ఈటెలతో పొడుచుకుంటూ చీల్చుకుంటూ పరస్పరం గాయపరుచుకుంటూ ఉండేవారు.

మత సంప్రదాయాలలో చిక్కుకుపోయిన ఇలాంటి వాళ్ళు తమతమ నమ్మకాలనే ధర్మము అనేవారు. నిజానికి వారు ధర్మము యొక్క నిజస్వరూపమును చూడనేలేదు. దానిని తమ అనుభూతికి తెచ్చుకోనేలేదు. అందువల్లనే భగవానుడు అంటాడు. . .

**తే అంధా అచక్ఖుకా**

- వారు అంధులు, ప్రజ్ఞాచక్షువిహీనులు కనుకనే

**అత్థం న జానన్తి, అనత్థం న జానన్తి**

- అర్థమేమిటో వాళ్ళకు తెలియదు, అనర్థమేమిటో వాళ్ళకు తెలియదు (మేలు ఏమిటో, కీడు ఏమిటో వాళ్ళకు తెలియదు).

**ధమ్మం న జానన్తి, అధమ్మం న జానన్తి**

- ధర్మమూ తెలియదు, అధర్మమూ తెలియదు.

ఈ విధంగా అర్థాన్ని అర్థమని తెలుసుకోకుండా, అనర్థాన్ని అనర్థమని తెలుసుకోకుండా, ధర్మమును ధర్మమని తెలుసుకోకుండా, అధర్మమును అధర్మమని తెలుసుకోకుండా తర్కవితర్కాలు, వాద వివాదాలు చేస్తూ, పరస్పరం కలహించుకుంటూ - పోట్లాడుకుంటూ ఉంటారు.

ఎవరు ధర్మమును అనుభూతిస్థాయిలో తెలుసుకుంటారో, వారు ఇటువంటి పనికిమాలిన నిరర్థకమైన దార్శనిక వాదవివాదములలో ఎలా చిక్కుకుంటారు? చిక్కుకోరు.

బుద్ధభగవానుడు లోకీయ, లోకోత్తర ధర్మనియమాలయొక్క సత్యాలను స్వయంగా సాక్షాత్కారం చేసుకున్నాడు. వాటిని తన అనుభూతిలోకి తెచ్చుకున్నాడు. అందుకే ఆయన నమ్మకాలతో కూడిన జీవితాన్ని జీవించలేదు. స్వానుభవంతో తెలుసుకున్న జీవితాన్ని జీవించేవాడు. ప్రజలకు కూడా ఇలాగే సత్యమును ప్రత్యక్షంగా అనుభూతిలోకి తెచ్చుకొని, తెలుసుకునే విద్యనే నేర్పాడు. ఏవో విన్న విషయాలపట్ల, చదివిన విషయాలపట్ల ఆసక్తులై, గందరగోళంలో చిక్కుకుపోనివ్వని విద్యను నేర్పాడు. సాధకుడు స్వయంగా అనుభవించినప్పుడే, అది అతనికి తెలుసుకున్న దర్శనమవుతుంది. సమ్యక్ దర్శనమవుతుంది. అలా కానప్పుడు అది దార్శనికమాన్యతల వేదాంతమై కూచుంటుంది. ఇంద్రియక్షేత్రముల సత్యమునంతా స్వీయానుభూతి స్థాయిలో **"యథాభూత్"** - ఉన్నది ఉన్నట్లుగా దర్శించినప్పుడు ఈ క్షేత్రం మొత్తమంతా అనిత్యధర్మం గలదని, దుఃఖధర్మం గలదని, అనాత్మధర్మం గలదని తెలుసుకుంటాడు. తత్ఫలితంగా దీనిపట్ల గల తాదాత్మ్యభావం తెగిపోతుంది, ఆసక్తి తెగిపోతుంది. స్థితప్రజ్ఞతాబలం ఆధారంగా అనాసక్తభావం దృఢమవుతుంది. బుద్ధుడు ఈ స్వానుభూతిజన్య సమ్యక్ దర్శనమునే నేర్పాడు. దార్శనికుల దర్శనాన్ని కాదు. అందువల్లనే బుద్ధవాణి మొత్తములో ఎంత వెతికినా **"బౌద్ధ-దర్శనం"** అన్న పదం కనిపించదు.

4) బుద్ధభగవానుడు సంప్రదాయవాది కాడు. తనదంటూ ఏ సాంప్రదాయాన్నీ ఆయన స్థాపించలేదు. ఆయన చూశాడు. బ్రాహ్మణులదైనా, శ్రమణులదైనా, సన్యాసులదైనా, వ్యవస్థ మొత్తం మతసంప్రదాయాల మీదనే ఆధారపడి వుంది. అందువల్లనే ఇవి మానవుడి ఆధ్యాత్మిక ప్రగతికి అవరోధాలయ్యాయి. సమాజ సామరస్యతకు, సహజీవనమునకు అడ్డుగోడలయ్యాయి. పరస్పరం పోట్లాడుకునేలా, గొడవపడేలా చేస్తుంటాయి.

5) బుద్ధభగవానుడు గొప్ప విజ్ఞానవేత్త, శాస్త్రవేత్త. ఆయన తన స్వంత అనుభూతికి వచ్చిన విజ్ఞానసమ్మతమైన ధర్మాన్ని నేర్పాడు. అంధవిశ్వాసాల మీద ఆధారపడిన సాంప్రదాయిక ధర్మాన్ని నేర్పలేదు. స్వయంగా ఆయన తన అనుభూతికి వచ్చిన సత్యములను అత్యంత వైజ్ఞానిక పద్ధతిలో విభజన చేస్తూ, విఘటన చేస్తూ, విశ్లేషణ చేస్తూ ప్రకృతి యొక్క సనాతన నియమాలను దర్శించాడు. ఆ జ్ఞానముతో లాభం పొంది, స్వయంగా తన మేలు సాధించుకున్నాడు. అలాగే ఈ సత్యాలను స్వానుభవంలోకి తెచ్చుకోవటం వల్ల కలిగే లాభాన్నీ, మేలునూ పొందగలిగేందుకు ఇతరుల్ని ప్రోత్సహించాడు. ఇందుకోసం, సరైన మార్గదర్శకత్వమిచ్చాడు.

ప్రకృతి యొక్క శాశ్వత నియమమే ధర్మం. దానిని నిజజీవితంలో ఆచరణలోకి తెచ్చుకొనడమే ధర్మజీవితం. ధర్మం సార్వజనీనమైనది, సార్వదేశికమైనది, సార్వకాలికమైనది. సనాతనమైనది. - అంటే ఎల్లవేళలా ఒకేలా నిలిచి ఉండేది. ధర్మానికి ఏ సంప్రదాయంతోనూ ఇచ్చిపుచ్చుకునే సంబంధం లేదు. ధర్మం అందరిది. హిందూధర్మం, బౌద్ధధర్మం అనే సంయుక్త పదాలనుండి "హిందూ, బౌద్ధ" అనే భ్రాంతి కలిగించే మాటల(సంజ్ఞల)ను తొలగిస్తే కేవలం శుద్ధధర్మమొక్కటే ఉండిపోతుంది. ఇదే భారతదేశపు పురాతన, సనాతన , వైజ్ఞానిక ధర్మం. ఇది దార్శనిక మేధాక్రీడ కారణంవల్లనూ, సాంప్రదాయిక హఠధర్మం (మొండిపట్టు) వల్లనూ మాటిమాటికీ కనుమరుగైపోతుంది. ఏ వ్యక్తి, శుద్ధ వైజ్ఞానిక పద్ధతిలో అనుసంధానం చేస్తూ, దీని సత్యమును వెతికి వెలికి తీస్తాడో, అతడు కరుణా చిత్తంతో లోకకల్యాణము కొరకై దీనినే ప్రకటిస్తాడు. బుద్ధభగవానుడు ఇటువంటి కల్యాణకారి ధర్మప్రజ్ఞాపకుడే. ఆయన ఏది నేర్పాడో దానిని **"ధర్మము"** అన్నాడు. కాని **"బౌద్ధధర్మము"** అని అనలేదు. బుద్ధవాణి అంతటా **"బౌద్ధ"** అన్న పదంగాని **"బౌద్ధధర్మం"** అన్న పదంగాని దొరకనే దొరకదు. ఏవిధంగానయితే తన శిక్షణకు ఆయన **"ధమ్మ"** - (ధర్మం) అని అన్నాడో, అదేవిధంగా ఆ శిక్షణను పాటించేవారిని **"ధమ్మికో" (ధార్మికులు), " ధమ్మట్ఠో" (ధర్మిష్ఠులు), "ధమ్మిం" (ధర్మవంతులు), "ధమ్మచారీ" (ధర్మచారులు), "ధమ్మవిహారీ" (ధర్మవిహారులు)** అని అన్నాడు.

6. బుద్ధభగవానుడు తాను ఒక భిషక్కునని, చికిత్సకుడినని, వైద్యుడినని చెప్పేవాడు. నిజంగానే ఆయన ఒక అద్వితీయమైన మనోచికిత్సకుడు. ఒక నిపుణుడైన వైద్యునిలాగా ఆయన రోగమును తెలుసుకున్నాడు; రోగకారణమును గుర్తించాడు ; ఆ కారణాన్ని తొలగించే ఉపాయాన్ని వెతికి వెలికి తీసాడు. దాని సముచిత వినియోగం ద్వారా కారణాన్ని నివారించి రోగమును తొలగించుటలో సఫలుడయ్యాడు. అందుకు సహాయకుడయ్యాడు. పుట్టుక, ముసలితనము, రోగము, మరణముల వంటి భవరోగములతో దుఃఖితుడై బాధపడుతున్న వ్యక్తికి- తాను వద్దనుకున్నది జరిగినప్పుడు, కావాలనుకున్నది జరగనప్పుడు కలిగే దుఃఖంతో వ్యాకులపడే వ్యక్తికి, ఈ దుఃఖములనుండీ, వ్యాకులతనుండీ ముక్తుడయ్యే సహజ, సరళ విధానమును తెలిపాడు. దీని అభ్యాసంతో ఏ దుఃఖితవ్యక్తయినా దుఃఖవిముక్తుడు కాగలుగుతాడు. ఆ వ్యక్తి తనను తాను హిందువునని పిలుచుకున్నా, బౌద్ధుడనని పిలుచుకున్నా; బ్రాహ్మణుడననీ లేక శూద్రుడననీ; భారతీయుడననీ లేక ఆంగ్లేయుడననీ; ఆత్మవాదిననీ లేక నిరాత్మవాదిననీ; ఈశ్వరవాదిననీ లేక నిరీశ్వరవాదిననీ - ఎలా పిలుచుకున్నా తేడా ఏమీ ఉండదు. సంప్రదాయ విహీనమైన సార్వజనీన నైసర్గిక సనాతన ధర్మము ఎవరిపట్లా పక్షపాతం చూపించదు. ఎవరు ధారణ చేస్తారో, వారు ప్రకృతి సత్యములను సాక్షాత్కారింపజేసుకుని దుఃఖవిముక్తులైపోతారు. ఎంతెంత ధారణ చేస్తే, అంతంత దుఃఖవిముక్తులైపోతారు.

ఆ గొప్పవైద్యుడు ఈ భవవిముక్తి విధానమును "విపశ్యన" అన్నాడు. విపశ్యన అంటే ప్రత్యేక పద్ధతిలో చూడటం. భోక్తాభావంతో చూడటంకాదు, అందుకుభిన్నంగా తటస్థభావముతో చూడటం. మన మూడున్నర మూరల దేహములోపల క్షణ-ప్రతిక్షణం ఏ సత్యము ప్రకటితమవుతున్నదో, దానిపై ఎలాంటి దార్శనిక నమ్మకమును గాని, మతసంప్రదాయపు అంధవిశ్వాసాల రంగులుగాని రుద్దకుండా, అది ఎలా ఉందో అలా ఉన్నదానిని ఉన్నట్లుగానే చూడటం.

ఈ విద్యను అభ్యసించుట కొరకు శారీరిక, వాచిక దురాచరణలను నిలిపివేసి, ప్రకృతిసిద్ధంగా, సహజ స్వభావంతో దానంతట అదే నడిచే శ్వాస రాకపోకలను చూస్తూ, మనసును ఏకాగ్రపరుచుకునే అభ్యాసం నేర్పాడు. తదనంతరం ప్రజ్ఞను మేల్కొల్పుకుని (తన ప్రత్యక్షజ్ఞానమును మేల్కొల్పుకుని) తనలోని సత్యములను చూడటము (గమనించి తెలుసుకొనడము) నేర్పాడు.

ఎప్పుడైతే ఒక వ్యక్తి శీల సమాధిల పునాదిపై ఆధారితమైన ప్రజ్ఞను జాగృతం చేసే ఈ విపశ్యన విద్యను అభ్యసించడం మొదలుపెడతాడో, అతనికి చాలా తొందరగా తన శరీర చిత్తముల [ఆకాలపు భాషలో చెప్పాలంటే నామము (అనగా చిత్తము) రూపము (అనగా శరీరము)] ప్రపంచమంతా అర్థమవడం మొదలవుతుంది. ఈ రెండింటి అంతర్ద్వందం స్పష్టమవడం మొదలవుతుంది. ఏవిధంగా రెండూ ఒకదాన్నొకటి ప్రభావితం చేస్తాయో, ఒకదాన్నుండి ఒకటి ఎలా ప్రభావితమవుతూ ఉంటాయో- ఇదంతా స్పష్టంగా చూడగలుగుతాడు.

కళ్ళు, ముక్కు, చెవి, నాలుక, చర్మము మరియు మనస్సులు- ఈ ఆరు ఇంద్రియములు - తమతమ విషయముల సంపర్కములోకి వచ్చినప్పుడు, లోలోపల శరీరము, చిత్తముల స్థాయిలో ఏ అలజడి మొదలయిందో, దానిని ఉన్నది ఉన్నట్లుగా చూస్తూ చూస్తూ, తన అంతర్మనస్సు యొక్క అలవాటుక్రమం ఎలా బంధనమును పెనవేస్తుందో స్పష్టంగా అర్థంచేసుకునే సామర్థ్యాన్ని పొందగల స్థితికి చేరుకుంటాడు. సుఖానుభూతి కలిగినప్పుడు రాగముతో, దుఃఖానుభూతి కలిగినప్పుడు ద్వేషముతో ప్రతిక్రియ చేస్తూవుండే ఈ అలవాటుక్రమం ఎంత బలమైనదో, ఎంత ప్రమాదకరమైనదో చూస్తాడు. ఈ అలవాటుక్రమం వల్లనే ప్రియమైన అనుభూతిని లభింపచేసుకోవాలనీ, అది లభించినప్పుడు దానిని నిలిపి ఉంచుకోవాలనే తృష్ణ బలోపేతమవుతూ ఉంటుంది. అప్రియ అనుభూతి కలుగరాదనీ, అది కలిగినప్పుడు దానిని దూరం చేసుకోవాలన్న తృష్ణ బలోపేతమవుతూ ఉంటుంది. ఇలా రాగమయ తృష్ణ మరియు ద్వేషమయ తృష్ణ పెరుగుతుంది. దాని ఆధారంగా ఇతర భిన్నభిన్న వికారములు పుట్టడమే కాదు, వాటి సంవర్ధనము (అనేకరెట్లు పెరగడము) కూడా అవుతూ ఉంటుంది. మనసులో ఈ వికారములు పుట్టడము దుఃఖదాయకము, వాటి సంవర్ధనము మరింత అధిక దుఃఖదాయకము. ఇది ప్రకృతి యొక్క తిరుగులేని నియమం. అందరికీ ఇది అన్వయిస్తుంది. ప్రతి ఒక్కరిపై అమలవుతుంది. ఎవరైనా తనను తాను హిందువునని, బౌద్ధుడనని లేక మరేమి అనుకున్నా తేడా ఏమీ ఉండదు. ప్రకృతి ఎవరినీ విడిచిపెట్టదు. ఎవరు తన మనసులో వికారము పుట్టించుకుంటే వారే వ్యాకులపడతారు. దుఃఖితులవుతారు. ఇది సార్వజనీన రోగము, సార్వజనీన వ్యాకులత. దీనిని దూరం చేసుకోవడానికి ఏ మతసంప్రదాయంలోనో దీక్ష తీసుకోవలసిన ఆవశ్యకతలేదు. అంధవిశ్వాసంతో ఏ దార్శనిక నమ్మకాన్నో స్వీకరించవలసిన ఆవశ్యకత లేదు. కులగోత్రవర్ణాల ఆధారంపై ఒకరిని ఉన్నతుడని, ఒకరిని నీచుడని,

అనుకోవలసిన ఆవశ్యకత లేదు. రోగమెలా సార్వజనీనమైనదో, దాని చికిత్సకూడా అలాగే సార్వజనీనమైనది. ఇదే బుద్ధభగవానుడి శిక్షణ. ఏ వ్యక్తి అయినా తనలోపలి సత్యములను తటస్థభావంతో చూడటం నేర్చుకున్నట్లయితే, వికారాల సంవర్ధనాన్ని నిలిపివేసుకోగలడు. ఇంకా ముందుకు వెళ్ళి, వికారాల పుట్టుకనే నిలిపివేసుకున్నట్లయితే, వికారాల పాతసంగ్రహం ఉదీర్ణమవడం ప్రారంభమవుతుంది. అంతర్మనస్సు లోలోతులలో కూడబెట్టుకునివున్న వికారాల సంగ్రహమంతా పెల్లుబికి పైకి రావడం మొదలవుతుంది. వికారాలు నిర్జరమవడం మొదలవుతుంది. అవి క్షీణించిపోవడం మొదలవుతుంది. ఇలా జరుగుతూ జరుగుతూ ఎక్కడయితే ***"ఖీణం పురాణం నవం నత్థి సంభవం'*** అనే స్థితి ఉందో అక్కడికి చేరుకోవడం జరుగుతుంది.

పాత మనోవికారాలన్నీ నశించిపోయాయి, కొత్తవాటి ఉత్పత్తి జరుగదు. ఇలాంటి స్థితిని చేరుకున్న వ్యక్తి, తనలోపల సమస్త భంగుర క్షేత్రాన్ని అనుభవిస్తూ, దానిని అతిక్రమణ చేసి, నిత్య, శాశ్వత, ధృవ, వినాశనము లేని పరమసత్యము యొక్క అనుభవాన్ని పొందుతాడు. ఎవరైనా దానిని నిర్వాణమని అన్నా, ముక్తి అని అన్నా, మోక్షమని అన్నా ఎలా అయినా అనుకోవచ్చు. అలాంటి వ్యక్తి భవసంసారం నుండి పూర్తిగా ముక్తుడవుతాడు. పూర్తిగా దుఃఖవిముక్తుడైపోతాడు.

ఆయన నేర్పిన ఈ ఆచరణాత్మక విద్యను కూడా ఒక పరంపరకు చెందిన నమ్మకం ఆధారంగా స్వీకరించడమో లేక తిరస్కరించడమో చేయరాదు. దీనిని అభ్యసించాలి, నిత్య జీవితంలో ఆచరించాలి. దీనికి తోడు ఈ అభ్యాసంవల్ల మనోవికారాలు తగ్గుముఖం పట్టాయా లేదా అని పరీక్షించి చూసుకోవాలి. మనోవికారాల పట్టు వదులుతున్నదా లేదా ? అని చూసుకోవాలి. ఈ అభ్యాసంతో ఎంతెంత ప్రత్యక్షలాభం కలుగుతోందో, అంతంత మాత్రమే స్వీకరించండి. ఎంత తెలుసుకుంటారో, అంతే నమ్మండి. ఇదే ఆ గొప్ప వైజ్ఞానిక ధర్మగురువు యొక్క ధర్మశిక్షణ. ఈ వైజ్ఞానిక శిక్షణ బలం మీదనే ప్రాచీన భారతదేశం విశ్వగురువుగా గౌరవించబడింది. ఈ నాడు కూడా ప్రపంచమంతా ఎవరెవరు ఈ విద్యను అభ్యసిస్తున్నారో, వారు దీని ప్రత్యక్షలాభాన్ని అనుభవిస్తున్నారు. వారు ఏ సాంప్రదాయపు ముళ్ళకంచెలోనూ బందీలయ్యే అవసరం ఉండదు. ఏ దార్శనిక నమ్మకం పట్ల అనుబంధం ఏర్పరుచుకునే ఆవశ్యకత వుండదు. అనుభూతిలోకి ఏ సత్యమువస్తే, దానినే నైసర్గిక ధర్మమని గ్రహించి స్వీకరిస్తూ, ఈ వైజ్ఞానిక ముక్తి మార్గంమీద ముందుకు సాగిపోవాలి.

ధర్మం యొక్క ఈ శుద్ధమార్గం మీద సాధకుడు ముందుకు సాగుతున్నకొద్దీ మతం పేరుతో కుల, గోత్ర, వర్ణముల పేరుతో, ప్రాంతాల పేరుతో గల సామాజికవిభజన వట్టి పనికిమాలినదని, నిష్ప్రయోజనమైనదని తెలుసుకుంటాడు. ఇవన్నీ ఎంతో హానికారకమైనవని గ్రహిస్తాడు. అందరినీ పట్టి పీడిస్తున్న రోగం ఒక్కటే అన్న విషయం తెలుసుకుంటాడు. ఎవరి చిత్తం వికారగ్రస్తమైతే వారు రోగులవుతారు; ఎవరి చిత్తం వికారవిముక్తమైతే వారు రోగవిముక్తులవుతారు. ఇందులో ఏ సంప్రదాయమైనా ఏమి చేయగలుగుతుంది? ఏ దార్శనిక నమ్మకమైనా ఏం చేయగలుగుతుంది? ఏ కులాల ప్రాతిపదిక విభజన అయినా ఏం చేయగల్గుతుంది? ఏ కర్మకాండైనా ఏం చేయగలుగుతుంది? ఏ వేషధారణయినా ఏం చేయగలుగుతుంది? సూటిగా, సరళంగా ఉన్న వైజ్ఞానిక విషయం. ఈ రూపం లోనే దీన్ని చూడాలి. ఈ రూపంలోనే స్వీకరించాలి. ఈ రూపంలోనే అనుభూతికి తెచ్చుకోవాలి.

ఈ విధంగా చేసినప్పుడు మాత్రమే బుద్ధుణ్ణి, ఆయన శిక్షణను సరైన విధంగా చూడగలుగుతాము. అర్థం చేసుకోగలుగుతాము. లేనిచో వాదవివాదాల బరిలో పడి మనకూ హాని కలిగించుకుని, అన్యులకూ హానికలిగిస్తాం. రండి, ఈ హానినుండి మనను మనం రక్షించుకుందాం! బుద్ధభగవానుడిని అర్థం చేసుకుందాం ! ఆయన శిక్షణను అర్థం చేసుకుందాం! దానిని ధారణచేసి మన మేలు సాధించుకుందాం ! మన శుభం సాధించుకుందాం !

***భవతు సబ్బమఙ్గలం.***

కల్యాణ మిత్రుడు

**సత్యనారాయణ గోయెంకా.**

*(విపశ్యన హిందీ మాసపత్రిక 25, మే 1994కు తెలుగు అనువాదం)*

## నూతన బాధ్యతలు

డా॥ ఎన్.పి. సుబ్రమణ్యం గారు **ఆచార్యులు**గా నియమించబడ్డారు. వారికి ధమ్మారామ భీమవరం కేంద్ర నిర్వహణ బాధ్యత అప్పగించబడింది.

**తెలుగు పత్రిక సంవత్సరపుచందా పూర్తి అయిన సాధకులు రూ. 50 ఈ క్రింది చిరునామాకు పంపి పత్రికను పొందగలరు.**

**విపశ్యన తెలుగు మాసపత్రిక,**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070. ఫోన్ : 2420290 (ఆశ్రమం).**

***(ఆఫీసు పనిచేయు వేళలు : ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు)***

**PRINTED MATTER**

TO

If Underlivered please return to:
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/3KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org

Published for Vipassana International Meditation Centre, 12/3 KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd. (A.P) -70. Ph : 040-24240290. Published by Smt. Sabrina Katakam.
Editor : Sri O. Premanand. Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 23325979. RNI No. APTEL/2006/17745